సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
9705347494
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఫిర్యాదు ఉపసంహరణ

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు ఆదర్శనగర్ – 1 సచివాలయం ఇన్‌చార్జి ఎం.సంతోష్‌కుమార్‌పై ఇటీవల మహిళా వలంటీర్లు చేసిన ఫిర్యాదు వాస్తవం కాదని అంగీకరిస్తూ మంగళవారం జెడ్సీ బి.రాముకు లేఖ అందించారు. పని ఒత్తిడి గురించి మాట్లాడితే కొందరు తమను బలవంతంగా తప్పుదోవ పట్టించారన్నారు. సంతోష్‌కుమార్‌పై ఇచ్చిన తప్పుడు ఫిర్యాదును ఉపసంహరించుకుంటున్నట్టు నలుగురు వలంటీర్లు సంతకాలతో కూడిన లేఖ జెడ్సీకి అందించారు.

ఘనంగా ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



అన్నదానం ప్రారంభిస్తున్న మణిశంకర నాయుడు తదితరులు

ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లిలో మంగళవారం పంచముఖ అంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ గంటా జగదీశ్వరరావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు, గ్రామస్తులు కలిసి సింధూర, తమలపాకుల పూజలు చేసి, హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ఈ సందర్భంగా సుమారు మూడు వేల మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బంటుబిల్లి మణిశంకర నాయుడు, ఇల్లాపు వెంకటరావు, గంటా అప్పలరాజు, పినిశెట్టి సింహాచలం నాయుడు, గీతల దేముడు తదితరులు పాల్గొన్నారు.


అందరికీ ఆరోగ్యమే లక్ష్యం



మధురవాడ గాయత్రి కళాశాల వద్ద ర్యాలీలో వైద్యులు, విద్యార్థులు

మధురవాడ: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గాయత్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌కేర్ అండ్ మెడికల్ టెక్నాలజీ కమ్యూనిటీ వైద్య విభాగం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మంగళవారం మధురవాడలోని కళాశాల ఆరవణలో అందరికీ ఆరోగ్యం అనే నినాదంతో నిర్వహించిన ర్యాలీని డీన్ ప్రొఫెసర్ ఎస్.సుబ్బారావు, ప్రొఫెసర్ ఇ.రవికిరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ వరల్డ్ హెల్త్ డేని పురస్కరించుకుని వారం రోజులుగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వైద్యులు జి.హారిక, సీహెచ్.హైమావతి, వి.రమ్య, పలువురు వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



పాలెపు రామలక్ష్మికి బీమా నగదు అందిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు రామునాయుడు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్టకు చెందిన ఆశా వర్కర్ పాలెపు రామలక్ష్మికి పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు వైఎస్సార్ బీమా నగదు కింద రూ.10 వేలు మంగళవారం అందించారు. ఇటీవల రామలక్ష్మి భర్త నారాయణరావు అస్వస్థతకు గురై మరణించాడు. వార్డు ప్రధాన కార్యదర్శి వెంపాడ వెంకట రమణ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది జగదీష్, సతీష్, వైఎస్సార్‌సీపీ నాయకులు కుమిలి సూర్యనారాయణరావు, తమ్మిన కూర్మారావు, గిడుతూరి వెంకటరావు తదితరులు నగదు అందించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
భీమిలి
9666125299, 9912440606

రేషన్ బియ్యం పక్కదారి

- డోర్ డెలివరీ వాహనం వద్దే అమ్మేస్తున్న కార్డుదారులు
- కొనుగోలు చేస్తున్న హాస్టళ్లు, హోటళ్ల నిర్వాహకులు
- 6.2 క్వింటాళ్లు స్వాధీనం చేసుకున్న అధికారులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు ఆదర్శనగర్‌లో పక్కదారి పడుతున్న 6.2 క్వింటాళ్ల పౌర సరఫరాల బియ్యాన్ని సీఎస్‌డీటీ కృష్ణారావు, చిట్టివలస వీఆర్వో బి.గీత మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. 17వ నంబరు రేషన్ డిపోకు చెందిన బియ్యాన్ని డోర్ డెలివరీ వాహనం ద్వారా డ్రైవర్ కమ్ ఆపరేటర్ ఆదర్శనగర్‌లో కార్డుదారులకు పంపిణీ చేస్తున్నాడు. ఇదే వాహనం వద్ద కొందరు బియ్యం కొనుగోలుదారులు గోనె సంచులు, డబ్బులతో మాటు వేసి ఉన్నారు. చాలా మంది కార్డుదారులు వారి నుంచి గోనె, డబ్బులు తీసుకుని బియ్యం విడిపించి వాహనం పక్కనే ఉన్న కొనుగోలుదారులకు అప్పగించి వెళ్లిపోతున్నారు. ఉదయం 5 గంటల నుంచి ఈ తతంగం జరుగుతుండడంతో 8 గంటల ప్రాంతంలో స్థానికులు విషయాన్ని రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులకు ఫిర్యాదు చేశారు. సచివాలయ సిబ్బంది మాత్రం కార్డుదారులు బియ్యం ఏమి చేసుకుంటారో వారి ఇష్టమని పట్టించుకోలేదు. చివరకు వీఆర్వో గీత, వీఆర్‌ఏ సంపూర్ణ అక్కడకు చేరుకోగా కొనుగోలుదారులు వదిలి పారిపోయిన 32 సంచుల్లో ఉన్న ఇరవై కిలోల వంతున బియ్యం మూటలను వైఎస్సార్‌సీపీ నాయకుడు సరగడ నాగిరెడ్డి వారికి అప్పగించారు.

గోతికాడ నక్కల్లా హాస్టల్, హోటళ్ల సిబ్బంది

గతంలో రేషన్ బియ్యం వినియోగించని వారిని ఇంటింటికీ తిరిగి గుర్తించిన కొనుగోలుదారులు ఇప్పుడు డోర్ డెలివరీ వాహనాల చుట్టూ కాపలా కాస్తున్నారు. వాహనం వచ్చే సమయం, కార్డుదారుల కంటే ముందే చేరుకుని పోటీపడి కిలోకు రూ.12 నుంచి రూ.16 చెల్లించి స్టాక్ పెట్టుకుంటున్నారు. హాస్టళ్లు, హోటళ్లలో ఇవే బియ్యాన్ని వండి వారుస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉన్న డీవీస్ ఉద్యోగులు ఒక్కరు కూడా ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న బియ్యాన్ని సొంతానికి వినియోగించకుండా వాహనం వద్దే విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. టీడీపీ సానుభూతిపరులైన వీరు అదే సమయంలో ప్రభుత్వం నాణ్యమైన బియ్యం ఇవ్వడం లేదంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. డోర్ డెలివరీ వాహనాల వద్ద వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా బియ్యం పక్కదారి పడుతున్నాయి. దీనిపై పౌరసరఫరాల శాఖ అధికారులు పటిష్ట నిఘా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.



కొనుగోలుదారులు వదిలి వెళ్లిపోయిన బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న వీఆర్వో గీత

సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం ఆవిష్కరణ

తగరపువలస: చిట్టివలస జ్యూట్ మిల్లు రామాలయం ఆవరణలో మంగళవారం 16 అడుగుల సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాన్ని ప్రధాన అర్చకుడు ఆకెళ్ల నరసింహమూర్తి ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన భక్తులకు ప్రవచనాలు వినిపించారు. అనంతరం ఆలయ ఆవరణలో మండపారాధన, సుబ్రహ్మణ్యస్వామి హోమం, స్వామికి పంచామృతాలతో అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి విశేషంగా భక్తులు పాల్గొన్నారు. వారందరికీ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, జీరు వెంకట రెడ్డి, మేకల శ్రీనివాస్, ప్రముఖ వ్యాపారవేత్త ఆదిమూలం నాగరాజు, టీడీపీ భీమిలి ఇన్‌చార్జి కోరాడ రాజాబాబు, పిట్ట సూరిబాబు, నాయకులు డీఏఎస్ రాజు, పిల్లా రాజేష్ పాల్గొన్నారు.



రామాలయం ఆవరణలో విగ్రహావిష్కరణలో అర్చకులు, ప్రముఖులు, భక్తులు

వెలమ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

మధురవాడ: గ్రేటర్ విశాఖ వెలమ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం మధురవాడలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ పూర్వ అధ్యక్షుడు కరణం రామ్మోహన నాయుడు అధ్యక్షతన గత కార్యకలాపాలపై చర్చించి నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. నాలుగేళ్లు కొనసాగే నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రేటర్ విశాఖ వెలమ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులుగా గొల్లంగి ఆనందబాబు, వంటాకుల శ్రీనివాసరావు, బండారు అనిల్‌కుమార్, కరణం రామ్మోహన నాయుడు, అధ్యక్షుడిగా చలుమూరి నాయుడుబాబు, ఉపాధ్యక్షులుగా జక్కాన దేముడు నాయుడు, రంధి నాయుడు, సూర్రెడ్డి సత్యనారాయణ, గుళ్లిపల్లి తిరుపతి నాయుడు, గురువు నారాయణరావు, చొక్కాపు మన్మథరావు, కాళ్ల రమణమూర్తి, తానారి రమణ, ప్రధాన కార్యదర్శిగా దొగ్గ దుర్గాప్రసాద్, సహాయ కార్యదర్శులుగా మడక ఈశ్వరరావు, బైపురెడ్డి రమేష్‌నాయుడు, కొల్లు సత్యనారాయణ, కోశాధికారిగా శిరపరపు గౌరీశంకర్, యూత్ ప్రెసిడెంట్‌గా దొగ్గ గణేష్ ఎన్నికయ్యారు.



చలుమూరి నాయుడుబాబు, దొగ్గ దుర్గాప్రసాద్

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరలా ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంలో సంపూర్ణ అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని లొడగలవానిపాలెంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో రాష్ట్ర ప్రజలు ఎంతో దగాకు గురయ్యారన్నారు. రాష్ట్రాభివృద్ధిని పట్టించుకోలేదు సరికదా ప్రజల సంక్షేమాన్ని కూడా విస్మరించారన్నారు. ప్రజల కష్టాలను పాదయాత్రలో కళ్లారా చూసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాలు పేరుతో అందరికీ ప్రయోజనం చేకూరే సంక్షేమ పథకాలను అమలు పరుస్తున్నారని వివరించారు. కనీస సౌకర్యాలు లేక చీకట్లో మగ్గిన పల్లెలు నేడు అన్ని రంగాల్లో పురోగమిస్తూ కళకళలాడుతున్నాయని చెప్పారు. భూముల రీ సర్వే వల్ల ఎప్పటి నుంచో ఉన్న రైతుల సమస్యలు పరిష్కారమవుతున్నాయని చెప్పారు. లొడగలవానిపాలెం పంచాయతీలో నాలుగేళ్ల కాలంలో రూ.2.80 కోట్లతో పాఠశాల భవనాలు, సిమెంట్ రోడ్లు, కాలువలు నిర్మించిన ఘనత వైఎస్సార్ సీపీదే అన్నారు. అవినీతి లేకుండా పాలన సాగిస్తున్న జగన్‌మోహన్ రెడ్డి లాంటి వ్యక్తిని మరిస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల మంజూరు పత్రాలను అందజేశారు. పలు ఇళ్లకు 'మా నమ్మకం నువ్వే జగన్' అనే స్టిక్కర్లను అంటించి ప్రజల మద్దతు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, సర్పంచ్ లొడగల రాజేశ్వరి, ఎంపీటీసీ సభ్యుడు రౌతు వెంకటరావు, లొడగల రమణ, సహకార సంఘం అధ్యక్షుడు పాండ్రంకి అప్పారావు, నాయకులు బంటుబిల్లి మణిశంకర నాయుడు, బంక సూర్యనారాయణ, పాండ్రంకి శ్రీను, కొలగాని వెంకట అప్పారావు, రౌతు అప్పలరాజు, బంక కృష్ణంనాయుడు, బొట్టా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ మాజీ ఎంపీటీసీ సభ్యుడు కుటుంబ సభ్యులకు పథకాల మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

బూత్ కమిటీలతో బలోపేతం

భీమునిపట్నం: భీమిలి పరిధి మూడో డివిజన్ బీజేపీ అధ్యక్షురాలు కంటుభుక్త సునీత ఆధ్వర్యంలో శక్తి కేంద్ర ప్రముఖ్‌లతో సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో కొత్తగా బూత్ కమిటీల ఏర్పాటు జరుగుతోందని, దీనివల్ల పార్టీకి మరింత బలం చేకూరుతుందన్నారు. ఇప్పటి నుంచే అన్ని చోట్ల కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రచారం చేయడంతో పాటు అందరికీ అవగాహన కల్పిస్తామని తెలిపారు. నాయకులు బూర అశోక్‌కుమార్, పోలుబోతు విజయ, బడే విజయకుమార్, తీగల ప్రభాకరరావు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందారుల సహకార సంఘ కార్యవర్గం

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నికలు మంగళవారం ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికల అధికారిగా దాకమర్రి పశువైద్యశాల వైద్యుడు ఆర్.శ్రీనివాస్ వ్యవహరించారు. మొత్తం 42 మంది సభ్యులకు 30 మంది హాజరయ్యారు. అధ్యక్షునిగా నక్కా నరసింగరావు, కార్యదర్శిగా పల్లా అప్పారావు, కోశాధికారిగా పల్లా రాము, సభ్యులుగా పల్లి గురువులు, పల్లా ఎల్లయ్య, పల్లా రామన్న, పల్లా పైడయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో తాటితూరు, టి.నగరపాలెం సర్పంచ్‌లు శిరిగుడి సంతోషి, పొట్నూరు ఛాయాగౌతమి, ఎంపీటీసీ సభ్యురాలు ఉండబట్ల ఆదిలక్ష్మి, పల్లా నీలిమ, పెద్దలు దుంపల ప్రభాకర్, పల్లా అప్పారావు శిరిగుడి ఈశ్వరరావు, పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

మా భవిష్యత్తు.. మా నమ్మకం జగనన్నే



మజ్జిపేటలో సర్వేలో ఎంపీపీ వాసురాజు



కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు

కొమ్మాది: మా భవిష్యత్, మా నమ్మకం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ప్రజలు ముక్తకంఠంతో నినదిస్తున్నారని 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు గొల్లల ఎండాడలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నాయకులు, గృహసారథులు, కన్వీనర్లతో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతీ గడపకు, సెల్ ఫోన్లకు స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో ఉప్పులూరి గోపి, మాదు చంటి, నొడగల రాంబాబు, లొడగల రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఎంతో మేలు

భీమునిపట్నం: అర్హులందరికీ సంక్షేమ పథకాల వల్ల ఎంతో మేలు జరిగిందని వైఎస్సార్‌సీపీ 3వ వార్డు అధ్యక్షుడు వాసుపల్లి కొండబాబు అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎగువపేట ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి తిరిగి స్టిక్కర్లు, కరపత్రాలు అందించారు. ఎక్కడా అవినీతికి తావులేకుండా లబ్ధిదారుల ఖాతాల్లోనే సంక్షేమ పథకాల నగదు జమ చేస్తున్నారన్నారు. నూకాలమ్మ ట్రస్ట్ బోర్డు చైర్మన్ వాసుపల్లి కొండబాబు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

తగరపువలస: వలందపేటలో చిల్ల సూర్యనారాయణరెడ్డి, కొసన శ్రీనివాసరెడ్డి, కోనాడ కనకారావు, శీరపు నరసింగరావు తదితరులు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. చిట్టివలస కళ్లాలులో మహిళ అధ్యక్షురాలు జీరు సుజాత ఆధ్వర్యంలో సర్వే చేశారు. భీమిలి మండలం మజ్జిపేటలో ఎంపీపీ దంతులూరి వాసురాజు, సర్పంచ్ మజ్జి సూరినాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు. సంతపేటలో చిప్పాడ వెంకటేష్, జగన్నాథ ఎల్లాజీ, చిల్ల ప్రమీల, చేట్ల అప్పలసూరమ్మ, నీలాపు సురేష్‌రెడ్డి, ఉప్పాడ అప్పలరెడ్డి, చేట్ల ఎల్లయ్యరెడ్డి పాల్గొన్నారు. శ్రీనగర్‌లో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు ఆధ్వర్యంలో సర్వే చేశారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ

పద్మనాభం: మండలంలోని ఆర్‌వీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులకు రేవిడి పంచాయతీ రౌతులపాలెం గ్రామానికి చెందిన గడ్రేటి శ్రీను బ్యాగులు, పెన్నులు, నోట్ పుస్తకాలు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం ఐ.వి.రామిరెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. పది రోజులకు ఒకసారి దాతల నుంచి వీటిని శ్రీను సేకరించి విద్యార్థులకు అందజేస్తుంటాడు. రౌతులపాలెం డొక్కా సీతమ్మ యూత్ సభ్యులతోపాటు కొంత మంది నుంచి వీటిని సేకరించి పంపిణీ చేస్తున్నాడు.



విద్యార్థినికి బ్యాగులు, పుస్తకాలు అందిస్తున్న శ్రీను

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆనందపురం : పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మంగళవారం ఓ వ్యక్తి మృతి చెందినట్టు ఆనందపురం పోలీసులు తెలిపారు. మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన పడాల పోలినాయుడు (61) ఈ నెల 4న తన ఇంటి వద్ద డ్రింక్ బాటిల్ అనుకొని సీసాలోని పురుగుల మందు తాగేశాడు. దీంతో అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం తగరపువలసలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు.

చికిత్స పొందుతూ మృతి చెందడంతో ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరాధార ఆరోపణలు మానుకోవాలి

పద్మనాభం: ల్యాండ్ పూలింగ్‌లో అవకతవకలు జరిగాయని కొంతమంది కిరాయి మనుషులతో మాజీ ఎంపీపీ డి.గోపాలకృష్ణమూర్తిరాజు నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్డీవో నిర్వహించిన విచారణలో తాను అవకతవకలకు పాల్పడలేదని నిర్ధారించారన్నారు. వైఎస్సార్ సీపీకి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు నష్టం కలిగించడానికే గోపాల కృష్ణమూర్తిరాజు నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు మాట్లాడుతూ జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, గంధవరం సర్పంచ్ జి.వి.కె.కె.వర్మ, గొర్రిపాటి పెద ఎర్రినాయుడుపై మాజీ ఎంపీపీ డి.గోపాలకృష్ణమూర్తిరాజు కొంత మంది రైతులతో తప్పుడు ఫిర్యాదు చేయించారన్నారు.

ఆర్డీవో విచారణలో అవకతవకలకు పాల్పడలేదని తేలిపోయిందన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, గొర్రిపాటి పెద ఎర్రినాయుడు, ఈర్ల ఈశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతీనోటా జగన్నామస్మరణే

పీఎం పాలెం: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ ఫలాలు అందుకుంటున్న లబ్ధిదారులంతా జగన్నామస్మరణ చేస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. పీఎం పాలెంలోని అవంతి ఫంక్షన్ హాలులో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఎన్ని పన్నాగాలు పన్నినా జగన్ హవాను ఆపడం అసాధ్యమన్నారు. సంక్షేమ పథకాలు ప్రజల ముంగిటకు తీసుకెళ్లి ప్రజల గుండెల్లో సీఎం జగన్ నిలిచిపోయారన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు సీఎం జగన్ మోహన్ రెడ్డి అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ మధురవాడ జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, 6వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, పోతిన ప్రసాదు, రాయిన సాయికుమార్, యల్లాజీ, అప్పారావు, జామి శివ పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే జీవితం ఆదర్శనీయం

భీమునిపట్నం: సంఘ సేవకుడు జ్యోతిరావు పూలే జయంతి ఇక్కడి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ 3వ వార్డు బీసీ సెల్ అధ్యక్షుడు కోండ్రు రామసూరప్పడు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వార్డు పార్టీ అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగారావు, నాయకులు వాసుపల్లి కొండబాబు, తమ్మిన రామలక్ష్మణ్, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, ఎర్నింటి అచ్చిబాబు, కదిరి ఎల్లాజీ, మైలిపల్లి లక్ష్మణరావు, ఎల్లాజీరావు పాల్గొన్నారు.

- వ్యవసాయ మార్కెట్ కమిటీ సమీపంలోని అంబేడ్కర్ కాలనీ వద్ద ఉత్తరాంధ్ర దళిత నాయకులు భాగం గోపాలరావు ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. భాగం లక్ష్మి, జీవీ రమణ, బోని ఈశ్వరకుమార్, పారుపల్లి నర్సింగరావు, కర్రి రేవతి పాల్గొన్నారు.

పద్మనాభం: మండలంలో పలుచోట్ల జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహించారు. పద్మనాభం జంక్షన్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఈర్ల ఈశ్వరరావు, గొర్రిపాటి పెద ఎర్రినాయుడు, బుగత సత్యనారాయణ పాల్గొన్నారు. రేవిడి పంచాయతీ రౌతులపాలెం ప్రాథమిక పాఠశాలలో పూలే, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉప్పాడ రాము, సహోపాధ్యాయులు కరుభుక్త సన్యాసినాయుడు, అనుపమ పాల్గొన్నారు.

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఉపాధ్యాయులు, విద్యార్థులు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు పూలే జీవిత చరిత్రను వివరించారు. ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, నాగమణి పాల్గొన్నారు.

- సంగివలస అనిల్ నీరుకొండ ఇంజినీరింగ్ కళాశాలలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి ప్రిన్సిపాల్ కె.శ్రీరామకృష్ణ తదితరులు నివాళులర్పించారు.

పీఎం పాలెం: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలూ పాటుపడిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని వైఎస్సార్ సీపీ నాయకులు కొనియాడారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి మంగళవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 6వ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, పోతిన ప్రసాద్, యల్లాజీ, సియాద్రి కనకరాజు, రాయన సాయికుమార్, జామి శివకుమార్, రమణ పాల్గొన్నారు.



భీమిలిలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు



పీఎం పాలెంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అనుమానిత రోగులకు కోవిడ్ పరీక్షలు

ఆనందపురం : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం మేరకు అనుమానిత రోగులకు మంగళవారం వైద్యాధికారులు కోవిడ్ పరీక్షలు నిర్వహించారు. మండలంలోని 18 సచివాలయాల పరిధిలో వలంటీర్లు, ఆశ కార్యకర్తలు పర్యటించి జలుబు, దగ్గు, జ్వరం లక్షణాలతో బాధపడుతున్న వారిని గుర్తించారు. ఈ మేరకు వారికి ఆయా సచివాలయాల్లో గల వెల్‌నెస్ సెంటర్లలో కోవిడ్ (రాపిడ్) పరీక్షలు నిర్వహించారు. వారందరికీ నెగిటివ్ రిపోర్ట్ వచ్చింది. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి కోరాడ శైలజ మాట్లాడుతూ మండలంలో ఎక్కడా కోవిడ్ కేసులు లేవని చెప్పారు. హెల్త్ సూపర్‌వైజర్ ఐ.గోవిందరావు, హెల్త్ అసిస్టెంట్లు సత్తిరాజు, మోహన్, తారకేష్, కోటేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

మేకల కాపరి ఆత్మహత్య

భీమునిపట్నం: భీమిలి మంగల వీధికి చెందిన మేకల కాపరి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇక్కడ నివసిస్తున్న ఒనుము ఆదిబాబు (43) మంగళవారం ఉదయం ఎస్‌వోఎస్ సమీపంలోని ఎర్రమట్టి దిబ్బల వద్దకు మేకలు కాయడానికి వెళ్లాడు. కొంత సేపటికి భార్య ఒనుము కొండ అక్కడకు రాగా... మద్యం సేవించడానికి రూ.200 అడిగాడు. దీనికి ఆమె సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత ఇస్తానని వెళ్లిపోయింది. ఈ క్రమంలో కొంత సేపటికి బంధువు వెంకటేష్‌కు ఫోన్ చేసి తనకు జీవితంపై విరక్తిగా ఉందని, ఆత్మహత్య చేసుకుంటున్నాని ఆదిబాబు చెప్పాడు. వెంటనే బంధువులు అక్కడకు వెళ్లి చూడగా ఉరి వేసుకుని కనిపించాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూరిల్లు దగ్ధం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు చిన్న ఉప్పాడలో పూరిల్లు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... వాసుపల్లి నల్లయ్య, మారయ్య నివసిస్తున్న పూరిల్లు నుంచి మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ అదుపులోకి రాకపోవడంతో ఐఎస్ఎస్ కళింగ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలికి చేరుకుని మంటలు అదుపుచేశారు. ప్రమాద స్థలాన్ని కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు పరిశీలించారు.

పాలిథిన్ వినియోగిస్తే చర్యలు

కొమ్మాది: పాలిథిన్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి హెచ్చరించారు. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ, గొల్లల ఎండాడ ప్రాంతాల్లో చికెన్ దుకాణాలు, చేపల మార్కెట్, కిరాణా దుకాణాల్లో మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ క్రమంలో పలు దుకాణాల నుంచి పాలిథిన్ కవర్లు స్వాధీనం చేసుకుని, సంబంధిత యజమానులకు జరిమానా విధించారు.

పత్రికా ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడము ఏమనగా నా కక్షిదారుడయిన నడింపల్లి వెంకట రామరాజు గారు ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని Regd. Sale Deed ద్వారా కొనుగోలు చేసుకొని ఆనాడే స్వాధీనము చేసుకొని తన అనుభవములో ఉంచుకొని G.P.A. Holder ని నియమించుకొని Boundary Wall నిర్మించుకొని అందులో Watchmen Shed ని కూడా నిర్మించుకొని Electricity Bill మరియు Vacant Land Tax కట్టుకుంటూ గత 12 సం॥ల నుండి తన అనుభవములో ఉంచుకొనియున్నాడు. నా కక్షిదారుడు ఎలాంటి క్రయ, విక్రయాలు జరుపలేదు. క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై నా కక్షిదారునికి తప్ప మరెవరికి ఎలాంటి హక్కు స్వాధీన అనుభవములు లేవు. కాని ఊటూరి చిన్నారెడ్డి అను అతను తప్పుడు పత్రికా ప్రకటన ఇచ్చి షెడ్యూలు దాఖలా ఆస్థి తనది (చిన్నా రెడ్డిది) అని నమ్మించి షెడ్యూలు దాఖలా ఆస్తిని అమ్మజూపుతున్నారని తెలియవచ్చింది. కావున క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరయినా క్రయ విక్రయములు గాని, ఎలాంటి Development agreements గాని, మరే ఇతర లావాదేవీలు జరిపిన అవి ఎంతమాత్రము చెల్లనేరవు. అట్లు జరిపిన వారిపై మా కక్షిదారుడు చట్టపరమైన సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకొనబడునని తెలియజేయడమైనది.

షెడ్యూలు: విశాఖపట్నం జిల్లా, విశాఖపట్నం రూరల్, మధురవాడ గ్రామము Survey No. 8/1లో Watchmen Shed మరియు Boundary Wall నిర్మించిన ఖాళీ జాగా విస్తీర్ణము 2402 Sq. Yards లేక 2008.38 Sq. Mtrs కొలతలు మరియు **హద్దులు : తూర్పు :** S.No. 9/1లో గల ఆస్తి, **దక్షిణం:** వేగి రాజు సింగరాజు గారి ఆస్తి, **పడమర:** S.No. 6/8లో గల ఆస్తి, **ఉత్తరం:** 60' Road (60 అడుగుల రోడ్డు).

K.APPA RAO, Advocate
D.No. 55-24-3, LIG-106, Sri nirupama Apartments,
H.B. Colony, Visakhapatnam-22. Cell: **9440320923**

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
భీమిలి
9912220753
Office mail : sakshiadvtvsp@gmail.com